

ప్రజాధనం దుర్వినియోగం!

- సీఎఫ్ఎంఎస్‌కు బదులుగా చెక్కుల రూపంలో అందజేత
- ఏడాది వ్యవధిలో రూ.9.06 కోట్ల బిల్లుల మాయ
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

కాంట్రాక్టర్లకు పప్పుబెల్లంలా కార్పొరేషన్ నిధులు

పనులు చేయకున్నా బిల్లులు మంజూరు?

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన నగదు, వివిధ గ్రాంట్ల రూపంలో వచ్చిన ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు అధికారులు పప్పుబెల్లం మాదిరిగా పంచిపెడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లు పనులు చేయకున్నా.. చేసినట్లుగా చూపి నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో అధికారులు భారీగా అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గత ఏడాది కాలంలో రూ.9.06 కోట్ల బిల్లుల చెల్లింపులు చేసిన విషయం సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగుచూసింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల పారదర్శకంగా ఉండేలా సీఎఫ్ఎంఎస్ పద్ధతిని ప్రవేశపెట్టారు. కానీ మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపులు దీనికి భిన్నంగా చెక్కుల రూపంలో ఇస్తున్నారు. ఏడాది కాలంలో 78 బిల్లులను చెక్కుల రూపంలో ఇచ్చారు. రూ.9.06 కోట్ల బిల్లులు చెల్లించగా, ఇందులో రూ.5.59 కోట్లు బడ్జెట్ ఆమోదం ఉన్నవి, బడ్జెట్ ఆమోదం లేనివి 3.47కోట్లు ఉండటం విశేషం. గతంలో మునిసిపల్ కార్పొరేషన్‌లో అకౌంటెంట్ ఉండేవారు కాదు. తమకు అనుకూలమైన ఒక జూనియర్ అసిస్టెంట్‌తో కథ నడిపేవారు. ఇటీవల కాలంలో అకౌంటెంట్ వచ్చారు. సీఎఫ్ఎంఎస్ పద్ధతిలో ప్రభుత్వానికి తెలిసేలా బిల్లులు చేయకుండా, చెక్కుల రూపంలో బిల్లులు చేయడంపై అభ్యంతరం తెలిపారు. దీనిపై కమిషనర్ గాని, ఇతర అధికారులు గాని పట్టించుకోలేదని సమాచారం. చెక్కుల రూపంలో బిల్లులు చేయడం నిబంధనలకు విరుద్ధమైనా రూ. 9.06 కోట్లకు పైగా బిల్లులను చేయడం గమనార్హం. ఈ అంశంపై సమాచార హక్కు చట్టం ద్వారా కొందరు వివరాలు కోరితే అసలు విషయం బయటకు వచ్చింది. మచిలీపట్నం పురపాలకసంఘంలో జరిగే అభివృద్ధి పనులను తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకే అప్పగిస్తారనే



మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ప్రచారం ఉంది. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతాప్రమాణాలతో చేయకున్నా బిల్లులు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసే అధికారులు, కాంట్రాక్టర్లు ఒక్కటై గుట్టు చప్పుడు కాకుండా నిధులను దారి మళ్లిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది కాలంగా కార్పొరేషన్‌లో చెల్లింపులు చేసిన బిల్లులు, వాటికి సంబంధించిన పనుల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరితే నాలుగైదు పనులకు బిల్లులు చేసినా ఏ పని, ఎక్కడ, ఎప్పుడు చేశారనే వివరాలు వెల్లడించలేదు.

అక్రమాలు ఇలా..

- మునిసిపల్ కార్పొరేషన్ నిధుల నుంచి ఏప్రిల్ 4వ తేదీన రూ.4.60 లక్షలను సీజీఎస్‌టీ, ఏజీఎస్‌టీ పేరుతో ఒక కాంట్రాక్టర్‌కు చెందిన ఆడిటర్ పేరుతో మంజూరు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఈ కాంట్రాక్టరుపై అధికారులకు ఇంత ప్రేమ ఎందుకు వచ్చిందని కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. గుమ్మటాల చెరువు చుట్టూ ఫెన్సింగ్, మరమ్మతు పనుల కోసం రూ.7లక్షలను ఈ ఏడాది ఏప్రిల్ 18వ తేదీన మంజూరు చేశారు. ఈ చెరువు వద్ద పనులు నామమాత్రంగానే చేశారనే ఆరోపణలు ఉన్నాయి.
- కార్పొరేషన్ పరిధిలోని 40 సచివాలయాల్లో మరమ్మతుల పనుల కోసం ఏప్రిల్ 15వ తేదీన రూ.4.44 లక్షలను బిల్లులు చేసినట్లుగా చూపారు. ఈ పనులు ఎక్కడ ఎంత మేర చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది డిసెంబరులో ఓ కాంట్రాక్టరు పేరున రూ.5.26 లక్షలను బిల్లులుగా చేశారు. ఏ పని చేశారనే అంశంపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో పాటు ఈ ఏడాది జనవరి

మిగతా 6లో..

హైవేపై అంధకారం

ఇబ్రహీంపట్నం- జి.కొండూరు మార్గంలో వెలగని వీధి దీపాలు

- కొన్ని నెలలుగా ఎవరికీ పట్టని సెంట్రల్ లైటింగ్ సిస్టం
- చీకట్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నిత్యం రద్దీగా ఉండే ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి 30పై అంధకారం అలుముకుంది. కొన్ని నెలలుగా సెంట్రల్ లైటింగ్ సిస్టం పనిచేయడంలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. హైవేపై ప్రయాణం దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులా మారింది. చీకట్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





చీకటిమయంగా కొండపల్లి ఎర్రబ్రిడ్జి దిగువ భాగం

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌గడ్ జాతీయ రహదారి 30ని 2014-19 మధ్య అప్పటి టీడీపీ హయాంలో జి.కొండూరు వరకు నాలుగు లేన్లుగా విస్తరించారు. సుమారు 12 కిలో మీటర్ల మేర రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. 2014-19 మధ్య కాలంలో సెంట్రల్ లైటింగ్ సిస్టంలో బాగానే పని చేసింది. 2019-24 మధ్య వైసీపీ హయాంలో ఈ లైటింగ్ సిస్టం పనిచేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని నెలలు బాగానే పని చేసినా ఈ మధ్య కాలంలో ఈ లైటింగ్ సిస్టం సవ్యంగా పని చేయడం లేదు. నెలల తరబడి లైట్లు వెలగడం మానేశాయి. వీటి నిర్వహణ బాధ్యతను ఎవ్వరూ తీసుకోవడం లేదు. రాత్రి వేళ కారు చీకట్లు

మిగతా 6లో..

బహుళ సంస్థల పేర్లతో ఖాతాలు

శరణ్‌కుమార్ మ్యూల్ మాయ

- యజమానులుగా కూలీలు, యాచకులు
- బయటకు వస్తున్న 'ఈ' మోసగాడి లీలలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): సీసీఈహెచ్‌డీ... ప్రోవెక్స్... క్వాంటమ్... పినాకిల్... ఇవన్నీ బహుళజాతి సంస్థల పేర్లు. ఈ సంస్థల పేర్లతోనే సైబర్ నేరగాళ్లకు విజయవాడకు చెందిన వడ్డేవల్లి లలితా శరణ్‌కుమార్ మ్యూల్ ఖాతాలను సమకూర్చాడు. దుబాయిలో బహుళ జాతి సంస్థలో ప్రముఖస్థానంలో ఉన్నానని కుటుంబీకులకు చెప్పిన ఈ యువకుడు చేసినా 'ఈ' నేరాల లీలలు క్రమంగా బయటకు వస్తున్నాయి. అజ్ఞాతంలో ఉన్న సైబర్ బూచోళ్లతో ఈ బెజవాడ యువకుడు దుబాయిలో దోస్తీ కట్టాడు. మ్యూల్ ఖాతాలను బ్యాంకుల్లో తెరిపించి వాటిని వారికి అందజేశాడు. ఫలితంగా కమీషన్ రూపంలో లక్షలాది రూపాయలను వెనకేసుకున్నాడు. మ్యూల్ ఖాతాలను సమకూర్చినందుకు టీసీఎస్‌బీ (తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో) పోలీసులు శరణ్‌కుమార్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

బ్యాంకు మేనేజర్లతో నేరుగా సంప్రదింపులు

సాధారణంగా ఒక ఖాతాను తెరవడానికి బ్యాంకర్లు సామాన్యులను నానా ఇబ్బందులు పెడతారు. ఈకేవైసీ(నో యువర్ కస్టమర్) ప్రక్రియలో చుక్కలు చూపిస్తారు. ఆధార్‌కార్డుపై ఒక చిరునామా, ప్రస్తుత నివాసం మరో చిరునామాలో ఉంటే దానికి సంబంధించిన ఆధారాన్ని చూపించే వరకు ఖాతా తెరిచే ప్రక్రియను ముందుకు వెళ్లనివ్వరు. అటువంటి బ్యాంకర్లు సైబర్ నేరగాళ్లకు అవసరమైన ఖాతాలను చాలా సులువుగా సమకూర్చారు. ఈ విషయంలో శరణ్‌కుమార్ చాలా కీలకంగా పనిచేసినట్టు తెలుస్తోంది. దుబాయి నుంచి అతడు ప్రతి 15 రోజులకు ఒకసారి తెలుగు రాష్ట్రాల్లో దిగేవాడు. ఖాతాలు ఎవరి పేరున తెరవాలో వారిని ఏజెంట్లు బ్యాంకులకు తీసుకెళ్లేవారు. అక్కడ బ్యాంక్ మేనేజర్లతో శరణ్‌కుమార్ నేరుగా సంప్రదింపులు చేసేవాడు. ప్రముఖ సంస్థల పేర్లతో రూపొందించిన డాక్యుమెంట్లను ఈకేవైసీ ప్రక్రియకు అందజేసేవాడు. కొంతమంది బ్యాంక్‌మేనేజర్లు శరణ్‌కుమార్‌తో చేతులు కలిపినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం చేయాల్సిన ఈకేవైసీని తూతూమంత్రంగా ముగించి మ్యూల్ ఖాతాలు తెరిచినట్టు టీసీఎస్‌బీ అధికారులు గుర్తించారు.

లింక్‌ల ద్వారా లాగేశారు

టీసీఎస్‌బీ అధికారులు చేసిన దర్యాప్తులో సీసీఈహెచ్‌డీ సంస్థ పేరుతో తెరచిన ఖాతాలోకి 234 లింక్‌ల ద్వారా రూ.21.06 కోట్లు, ప్రోవెక్స్ వడ్ ట్రేడర్స్ పేరుతో తెరచిన ఖాతాలోకి తొమ్మిది లింక్‌ల ద్వారా రూ.34.19 లక్షలు, క్వాంటమ్ క్వాంటిఫెంట్ ఇన్నోవేషన్స్ పేరుతో ఉన్న ఖాతాలోకి 19 లింక్‌ల ద్వారా రూ.1.42 కోట్లు, పినాకిల్ పల్స్ ఎంటర్‌ప్రైజస్ పేరుతో తెరచిన ఖాతాలోకి 20 లింక్‌ల ద్వారా రూ.34.22 లక్షలు, సినర్జీ స్విఫ్ట్ ట్రేడర్స్ పేరుతో ఉన్న ఖాతాలోకి 95 లింక్‌ల ద్వారా రూ.8.49కోట్లు, ప్రోవెక్స్ ఏహెచ్ఎం ఫ్యూజన్ సంస్థ పేరున తెరచిన ఖాతాలోకి 234 లింక్‌ల ద్వారా రూ.124.55 కోట్లు జమ అయినట్టు గుర్తించారు. ఈ ఖాతాలన్నీ వేర్వేరు వ్యక్తుల పేర్ల మీద ఉన్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేసే అవకాశం వంటి నేరాలకు సంబంధించిన లింక్‌లను ప్రజలకు పంపి ఈ మొత్తాలను లాగేసినట్టుగా భావిస్తున్నారు.

టీడీపీ రథసారథుల కసరత్తు కొలిక్కి!

- ఎన్టీఆర్ జిల్లా నుంచి నాలుగు పేర్లు పరిశీలకుల దృష్టికి తెచ్చిన శ్రేణులు
- వీరిలో బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా, గన్నే నారాయణ ప్రసాద్, బొమ్మసాని సుబ్బారావు
- నామినేటెడ్ పదవులు పొందిన వారికి అవకాశం దాదాపు లేనట్టే!
- కుల సమీకరణల కంటే.. సమర్థవంతమైన నాయకులకే పగ్గాలివ్వాలని డిమాండ్

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పార్టీ శ్రేణులతో త్రిసభ్య కమిటీల భేటీ

పరిశీలకుల దృష్టికి కృష్ణా జిల్లా నుంచి మూడు పేర్లు

వీరిలో గొట్టిపాటి రామకృష్ణ, కొనకళ్ల నారాయణరావు, కోనేరు నాగేంద్రకుమార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్, కృష్ణాజిల్లా రథసారథుల ఎన్నికల కసరత్తు కొలిక్కి వచ్చింది. అధిష్ఠానం నియమించిన త్రిసభ్య కమిటీలు ఆదివారం ఎన్టీఆర్, కృష్ణాజిల్లా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, సీనియర్ కార్యకర్తల అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తీసుకున్నాయి. రెండు జిల్లాలకు అధ్యక్షులుగా త్రిసభ్య కమిటీలు ఏడుగురి పేర్లను స్వీకరించాయి. ఎన్టీఆర్ జిల్లాలో బీసీ సామాజికవర్గం నుంచి బుద్ధా వెంకన్న, నాగుల్ మీరాల పేర్లు, ఓసీ సామాజికవర్గం నుంచి గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న), బొమ్మసాని సుబ్బారావు పేర్లు ప్రధానంగా వచ్చాయి. ప్రస్తుత అధ్యక్షుడు నెట్టెం రఘురాంతో పాటు మరికొందరి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. కృష్ణాజిల్లా నుంచి ప్రస్తుత అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును కొనసాగించాలని ఎక్కువశాతం మంది ప్రజాప్రతినిధులు ప్రతిపాదించారు. రెండవ పేరుగా గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌ను ప్రతిపాదించారు. మూడవ పేరుగా కోనేరు నాగేంద్ర కుమార్‌ను విజయవాడ రూరల్ పార్టీ నాయకులు ప్రతిపాదించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల నుంచి స్వీకరించిన ఈ పేర్లను త్రిసభ్య కమిటీలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాయి. వీరిలో అధ్యక్షులెవరన్నది అధినేత చంద్రబాబు నిర్ణయంతో ఫైనల్ అవుతోంది.



మచిలీపట్నంలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కాలువ శ్రీనివాసులు, దామచర్ల సత్య, పి.గోవింద్, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ తదితరులు

ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో..

ఎన్టీఆర్ జిల్లాలో ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి త్రిసభ్య కమిటీలోని సభ్యులు పయ్యావుల కేశవ్, బీటీ నాయుడు హాజరయ్యారు. జిల్లా పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ పతాక ఆవిష్కరణ జరిపారు. అనంతరం భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన నిర్ణయాల గురించి వివరించారు. ఆ తర్వాత జిల్లా పార్టీ కమిటీల ఎన్నికకు

మిగతా 6లో..

మచిలీపట్నం డంపింగ్ యార్డులో పర్యటిస్తున్న మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



72 లక్షల టన్నుల చెత్త తరలించాం

- చెత్త నుంచి సంపద తయారీకి ప్రాధాన్యం
- పురపాలక శాఖ మంత్రి నారాయణ 6

హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

- ప్రథమ బహుమతి జీవన్ నగర్ సొంతం
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ 6



నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మొగల్రాజపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ 29 వరకు వృద్ధులు, దివ్యాంగులకు కార్డులను పంపిణీ చేస్తారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి సాధారణ కార్డుదారులకు రేషన్ షాపుల వద్ద అందజేస్తారు. ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ.పాపారావు మాట్లాడుతూ జిల్లాలో 5,87,135 కార్డులు ఇస్తున్నట్టు తెలిపారు. సోమవారం నుంచి 29వ తేదీ వరకు వీఆర్‌వో, ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో పంపిణీ చేస్తారని వివరించారు. కార్డుదారులు బయోమెట్రిక్, ఓటీపీ ద్వారా కార్డు పొందవచ్చని చెప్పారు.

ప్రతిష్టాత్మకంగా దసరా ఉత్సవాలు

- సామాన్య భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం
- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

6

పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

6

అతివేగానికి ఒకరి బలి

- మరొకరి పరిస్థితి విషమం


ఇంద్రకీలాద్రిపై దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

ప్రతిష్టాత్మకంగా దసరా ఉత్సవాలు

- సామాన్య భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం
- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దుర్గగుడిలో ప్రతిష్టాత్మకంగా దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్టు తెలిపారు. ఆదివారం ఆయన దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి దుర్గగుడిలో దసరా ఏర్పాట్లను పరిశీలించారు. కొండపైన, దిగువన ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది దుర్గగుడిలో దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాలలో ప్లాస్టిక్‌కు బదులు రీ సైక్లింగ్ వస్తువులను వాడనున్నట్టు తెలిపారు. దేవస్థానంలో పర్యావరణ హితంగా ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రాంబాబు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

- మంత్రి సుభాష్

విద్యాధరపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తూ.. వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ కూటమి ప్రభుత్వమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ ఆటోనగర్‌లో కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ హాల్లో జరిగిన గౌడ, శెట్టిబలిజ, ఈడిగా, యాత, శ్రీశయనల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయిక సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వనన్ని నిధులు కేటాయించి బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. బీసీల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.42,456 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.39,700 కోట్లు మాత్రమే కేటాయించిందని, కూటమి ప్రభుత్వం అదనంగా 21 శాతం నిధులు పెంచి, బీసీల పక్షపాతి అని నిరూపించుకుందన్నారు. సీఎం చంద్రబాబు కీలకమైన పదవులు బీసీలకు కేటాయించి సముచిత స్థానం ఇచ్చారన్నారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఆత్మీయ సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకిగురుమూర్తి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో గణపతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథరాజు తదితరులు

పర్యావరణ హితంగా గణేశ్ ఉత్సవాలు

- ఉత్సవసమితి జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథరాజు

విజయవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహితంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని గణపతి నవరాత్రి ఉత్సవసమితి రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథరాజు తెలిపారు. నగరంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంటపాల ఏర్పాటు విషయంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితను కలిసి సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలంటూ వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మంటపాల్లో అసభ్యపాటలు, రాజకీయ అంశాలు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. సింగిల్ విండో విధానంలో సమస్యలు వస్తే సమితి పరిష్కరిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలీసుల ఇబ్బందులపై కూడా సమితి స్పందిస్తుందని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యదర్శి దుర్గాప్రసాద్‌రాజు మాట్లాడుతూ, గణేష్ మంటపాలకు కావాల్సిన అనుమతులు, ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వాన్ని కోరామన్నారు. పోలీసు యంత్రాంగం పరిశీలన తర్వాత ఎన్‌ఓసీ జారీ చేస్తుందని తెలిపారు. ఉత్సవాలు ధార్మిక చింతన కలిగించేలా నిర్వహించాలని నిర్ణయించగా, భక్తిగీతాలను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బిట్రా వెంకటేశ్వరరావు, కార్యదర్శి సానా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు రవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్ : పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు, డీఏ అరియర్స్, బకాయిల చెల్లింపు, ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.విద్యాసాగర్, డీవీ రమణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య (ఏపీపీఎస్ఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, పంచాయతీల రీగ్రూపింగ్, సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలు కావాల్సిన పంచాయతీ కార్యదర్శులకు గ్రూప్-3 పేస్కేల్ అమలు, పని ఒత్తిడి తగ్గింపు, నిర్దిష్ట పనివేళలు, జాబ్‌చార్ట్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసుకుని సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి పేరును గ్రామ అభివృద్ధి అధికారి లేదా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మార్చాలని తీర్మానించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాస్థాయి కమిటీల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

72 లక్షల టన్నుల చెత్త తరలించాం

- చెత్త నుంచి సంపద తయారీకి ప్రాధాన్యత
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మునిసిపాలిటీలను చెత్తలేని స్వచ్ఛ నగరాలుగా తీర్చిదిద్దుతున్నామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. మచిలీపట్నం డంపింగ్ యార్డును ఆదివారం మంత్రి సందర్శించి చెత్తను తరలించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. చెత్త ప్రభుత్వం వెళుతూ.. చెత్తతో పాటు అప్పులు మిగిల్చి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్రంలో చెత్త లేకుండా ఉండే స్వచ్ఛమైన నగరాలను తీర్చిదిద్దేందుకు 2014లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 10 చోట్ల చెత్తతో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వాటిల్లో విశాఖపట్నం, గుంటూరు మినహా మిగిలిన చెత్త ఉత్పత్తి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చెత్తపై పన్ను వేసి.. రూ.10 లక్షల కోట్ల అప్పులతో పాటు 85 లక్షల టన్నుల చెత్త మిగిల్చిందన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

2024 అక్టోబరు 2న సీఎం చంద్రబాబు మచిలీపట్నం వచ్చినప్పుడు రాష్ట్రంలోని 85 లక్షల టన్నుల చెత్తను ఏడాదిలో సంపద కేంద్రాలకు తరలించాలని ఆదేశించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు ఇప్పటికి 72 లక్షల టన్నుల చెత్తను సంపద కేంద్రాలకు తరలించామని, ఇంకా 13 లక్షల టన్నుల చెత్త మిగిలి ఉందని, ఈ చెత్తను 40 రోజుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాకినాడ, రాజమండ్రిల మధ్య ఒక సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. అదే విధంగా నెల్లూరు, కర్నూలు, కడప, తిరుపతి, విజయవాడల్లో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించామన్నారు. గుంటూరు కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. మచిలీపట్నంలో చెత్తను గుంటూరు కేంద్రానికి తరలిస్తున్నారన్నారు. పూర్తి స్థాయిలో మచిలీపట్నంలోని చెత్తను తరలించేందుకు అదనంగా రెండు కాంపాక్ట్‌లు అందించామన్నారు. రాష్ట్రంలో రోజుకు 7000 టన్నుల చెత్త వస్తుందని వాటిలో 6500 టన్నుల చెత్తను ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి కేంద్రాలకు పంపుతున్నామన్నారు. మరో 500 టన్నులు సంపద ఉత్పత్తి తయారీ కేంద్రాలకు పంపించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో లిక్విడ్ వేస్టు నీటిని ట్రీట్‌మెంట్ చేసి శుభ్రమైన నీరుగా తయారు చేసేందుకు యోచిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వరలక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేటలో కలకలం రేపిన వీఆర్వో ఆత్మహత్యాయత్నం

- ఆసుపత్రిలో కోలుకున్న బాధితురాలు

జగ్గయ్యపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట మండలం అన్నవరం గ్రామ వీఆర్వో నటుకుల వరలక్ష్మి ఆత్మహత్యాయత్నం స్థానికంగా కలకలం రేపింది. బూదవాడ గ్రామానికి చెందిన వరలక్ష్మి అన్నవరం వీఆర్వోగా పనిచేస్తున్నది. శుక్రవారం రాత్రి నుంచి ఆమె కనబడకుండా పోవటంతో కుటుంబసభ్యులు చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆమె మొబైల్ సిగ్నల్ ఆధారంగా విజయవాడలో ఉన్నట్టు గుర్తించారు. త్వరాత కొద్ది సేపటికి ఆమె విజయవాడ నుంచి జగ్గయ్యపేట వచ్చి అన్నవరం గ్రామానికి వెళ్లింది. గ్రామ శివార్లలో శనివారం మధ్యాహ్నం పొలాల్లో అపస్మారకస్థితిలో ఉండగా ఆమెను హుటాహుటిన జగ్గయ్యపేటలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం ఆమె కోలుకున్నది. ఎమ్మెల్యే తాతయ్య, మండల అధికారులు, తోటి వీఆర్వోలు, ఆమె బంధువులు బాధితురాలిని పరామర్శించారు. కాగా వీఆర్వో బంధువులు గత కొద్దికాలంగా పని ఒత్తిళ్ల వల్ల ఆందోళనగా ఉంటోందని, శుక్రవారం నుంచి కనిపించక పోవటంతో పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు, విధానాల అమలులో పనితీరు మెరుగుపరచుకోవాలని కింది ఉద్యోగులకు సూచించటం, ఆదేశించటం సహజంగా జరిగేదని అన్నారు.

మెమో 57 అమలు కోరుతూ మహాధర్నా నేడు

గాంధీనగర్ : డీఎస్సీ- 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కేంద్రం ఇచ్చిన మెమో 57ను అమలు చేయాలని కోరుతూ సోమవారం ధర్నాచౌక్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా చేపడుతున్నట్టు డీఎస్సీ-2003 ఉపాధ్యాయ ఫోరమ్ స్టేట్ కన్వీనర్లు శ్రీనాథ్, తమ్ము నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దతుగా ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయ, ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

న్యూరో సర్జరీల్లో రోబోల కీలకపాత్ర

- ‘న్యూరో నెక్సస్ 2025’లో వైద్య నిపుణులు

గుంటూరు మెడికల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో న్యూరో సర్జరీ విభాగంలో రోబోల పాత్ర మరింత కీలకంగా మారుతుందని ఆస్టర్ ఇండియా మెడికల్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సోమశేఖర్ అన్నారు. త్వరలోనే ఆస్టర్ రమేశ్ గ్రూప్‌లో న్యూరో రోబోటిక్ సర్జరీలను ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి న్యూరాలజీ వైద్య విద్యా కార్యక్రమం ‘న్యూరో నెక్సస్ 2025’లో సోమశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేశ్‌బాబు మాట్లాడుతూ.. న్యూరో వైద్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనుసంధానిత సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ఫలితాలు అత్యంత కచ్చితత్వంతో శాస్త్రీయ వైద్యం అందించేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. సైంటిఫిక్ సెషన్‌లో పలువురు న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు.. మూర్ఛ వ్యాధులు, పక్షవాతం, మూవ్‌మెంట్ డిజార్డర్, న్యూరో సర్జరీ విభాగాలలో నూతనంగా వస్తున్న విప్లవాత్మక వైద్యవిధానాలను వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్, ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ న్యూరాలజిస్టులు కుమారవేలు, హరిణి, లక్ష్మీ అనూష, ప్రశాంత్ బాబు, రాజేశ్, దీప్తి, న్యూరోసర్జన్లు అరుణ్, ధీరజ్, పృథ్వీ, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారాయుడు, కార్యదర్శి బి.సాయికృష్ణ, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ బి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సోమశేఖర్, రమేశ్‌బాబు

బుడమేరు ముంపు నుంచి కాపాడండి

- 30న సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

గవర్నర్‌పేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు ముంపు నుంచి విజయవాడ, పరిసర ప్రాంతాలను కాపాడాలని సీపీఎం డిమాండ్ చేసింది. ముంపు నివారణకు రూ.10 పదివేల కోట్లు విడుదల చేయాలని కోరుతూ.. ఈనెల 30న నిరసన, వారం రోజులు ప్రచార ఉద్యమం చేపట్టనున్నట్టు ప్రకటించింది. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ, బుడమేరు కన్నీటి కష్టాలకు ఏడాది పూర్తయినా.. ముంపు నివారణ శాశ్వత చర్యల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షం వస్తే భయంతో బుడమేరు బాధితులు బతుకుతున్నారని, ఒకచోట గండిపూడ్చి పనులన్నీ పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందన్నారు. రూ.6880 కోట్లు కోరినా కేంద్రం చిల్లిగవ్వ విదల్చలేదని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దీనిపై నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు.


మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

ఇప్పటికైనా ప్రభుత్వం శాశ్వత చర్యలపై దృష్టి సారించాలని, తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంచనాలు రూపొందించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలన్నారు. ఈనెల 30న విజయవాడ సింగ్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బాధితులతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు వెల్లడించారు. సోమవారం నుంచి వారంరోజుల పాటు వరద బాధిత ప్రాంతాల్లో ప్రచార ఉద్యమం, పాదయాత్ర నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, నేతలు బోయి సత్యబాబు, వి. రమణారావు పాల్గొన్నారు.

టీడీపీ రథసారథుల కసరత్తు కొలిక్కి!

(5వ పేజీ తరువాయి)

సంబంధించి చర్చ నిర్వహించారు. సమావేశానికి మొత్తం 350 మంది హాజరయ్యారు. ముఖ్యంగా ప్రజా ప్రతినిధుల నుంచి జిల్లా కమిటీలకు సంబంధించి ప్రతిపాదిత పేర్లను స్వీకరించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య తమ ప్రతిపాదనలను అందజేశారు. పార్టీ నాయకులు తమ ప్రతిపాదనలను తెలియజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కసరత్తు సాగింది. జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యుల పేర్లతో పాటు, అనుబంధ సంఘాలు, బీసీ సాధికార కమిటీలకు తీసుకోవాల్సిన పేర్లను అందరి నుంచి లిఖితపూర్వకంగా తీసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు నెట్టెం రఘురాం పేరును కొందరు సూచించినప్పటికీ ఆయన ప్రస్తుతం కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నామినేటెడ్ పదవిలో ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు బీసీ, ఓసీ సామాజిక వర్గాలలో ఎవరికి అన్నదానిపై ఇంకా తుది నిర్ణయానికి అధిష్ఠానం రాలేదు. బలహీనవర్గాల నుంచి పూర్వ అర్బన్ అధ్యక్షుడిగా పనిచేసిన బుద్ధా వెంకన్నతో పాటు దూదేకుల సామాజిక వర్గం నుంచి నాగుల్‌మీరాల పేర్లు ప్రధానంగా వచ్చాయి. నాగుల్ మీరాను ఇప్పటికే నూర్ బాషా, దూదేకుల సంక్షేమ శాఖ చైర్మన్‌గా నియమించారు. ఓసీ సామాజిక వర్గం నుంచి గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న), బొమ్మసాని సుబ్బారావు పేర్లు ప్రధానంగా వచ్చాయి. గన్నే అన్న అర్బన్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా గతంలో సమర్థవంతంగా పనిచేశారు. బొమ్మసాని సుబ్బారావు పార్టీలో సీనియర్ నాయకుడు.

మచిలీపట్నం సమావేశానికి ముగ్గురు హాజరు

కృష్ణాజిల్లా పార్టీ సమావేశం మచిలీపట్నంలోని మన కన్వెన్షన్ హాలులో జరిగింది. త్రిసభ్య కమిటీ సభ్యులైన కాలువ శ్రీనివాసులు, దామచర్ల సత్య, పి.గోవింద్ హాజరయ్యారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, డిప్యూటీ మాజీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, టీడీపీ సీనియర్ నాయకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 400 మంది ఈ సమావేశానికి వచ్చారు. కాలువ శ్రీనివాసులు, దామచర్ల సత్య, పి.గోవింద్ సంయుక్తంగా ప్రజా ప్రతినిధులు, నాయకుల నుంచి సీల్డ్ కవర్లలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ, అనుబంధ సంఘాలు, బీసీ సాధికార కమిటీల పేర్లను స్వీకరించారు. జిల్లా పార్టీ నుంచి ముక్తకంఠంతో కొనకళ్ల నారాయణ పేరును ప్రతిపాదించారు. కొనకళ్ల ఇప్పటికే ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నారు. అధినేత అవకాశం కల్పిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. పార్టీలో 30 ఏళ్ల నుంచి కొనసాగుతున్న సీనియర్ నాయకుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌కు ఇప్పటి వరకు సముచిత స్థానం లభించలేదు. ఈ సారి గొట్టిపాటి పేరును పలువురు గట్టిగా ప్రతిపాదించారు.

అధినేత నిర్ణయమే ఫైనల్

రెండు జిల్లాల నుంచి ప్రతిపాదించిన వారిలో అధ్యక్షుల ఎంపిక అధినేత చంద్రబాబు స్వయంగా చేపడతారు. అధ్యక్షుల ఎంపికలో సామాజిక సమీకరణలు కూడా తప్పనిసరిగా చూసే అవకాశం ఉంది. కుల సమీకరణల కంటే కూడా రాష్ట్రంలో కీలకమైన ఈ రెండు జిల్లాలకు సమర్థవంతులైన వారికే పార్టీ పగ్గాలు అప్పగించాలన్నది అందరి అభిప్రాయంగా ఉంది. మరి అధినేత ఏం చేస్తారో ? ఎవరికి అవకాశం కల్పిస్తారో వేచి చూడాల్సిందే.

హైవేపై అంధకారం

(5వ పేజీ తరువాయి)

కమ్ముకున్నట్లుగా జాతీయ రహదారి ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పైగా వాహన రాకపోకల సమయంలో కంకర రహదారిపై పడటంతో అది రాత్రి వేళ కనపడక ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

డేంజర్ స్పాట్‌గా కొండపల్లి ఎర్రబిడ్జి దిగువ భాగం

ఈ జాతీయ రహదారిలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా కొండపల్లి ఎర్ర బ్రిడ్జి దిగువ భాగం ఉంది. కొండపల్లి రైల్వేస్టేషన్ వైపు వెళ్లే వాహనాలు జాతీయ రహదారి నుంచి వెళుతుంటాయి. ఎర్ర బిడ్జి ఎక్కే వాహనాలు, ఎర్ర బ్రిడ్జి మీద నుంచి దిగే వాహనాలు కొండపల్లి ఊళ్లోకి వెళ్లే వాహనాలు మూడు ఇక్కడే కలుసుకుంటాయి. లైట్లు లేక ఇక్కడ చీకటి అలుముకుంది. దీంతో ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణం జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టం బాగు చేయించి వెలుగులు నింపాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

హైవేపై రాత్రి వేళల్లో ద్విచక్రవాహనంపై రావాలంటే భయం వేస్తుంది. లైట్లు వెలగడం లేదు. నెలల తరబడి ఇదే సమస్య ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. హైవే మొత్తం చీకటిమయంగా ఉంటుంది. నిత్యం వాహనాల రద్దీ ఉండే హైవే చీకటిగా ఉంటే అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలి.

- బాధినేని విజయరాజు, జి.కొండూరు

తక్షణం లైట్లు వెలిగించాలి

ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే వరకు ఉండకుండా తక్షణం అధికారులు స్పందిచాలి. గతంలో శుభ్రంగా వెలిగిన లైట్లు ఇప్పుడెందుకు వెలగడం లేదు. లైట్లు ఆపేసి విద్యుత్‌ను ఆదా చేసుకుంటున్నారనే అనుమానాలున్నాయి. ప్రజల, వాహనచోదకులు ఇబ్బందులు పట్టావా. ప్రజల నుంచి తిరుగుబాటు మొదలవ్వక ముందే స్పందించి లైట్లు వెలిగించాలి.

-బట్టుపర్తి రవీంద్ర, జి.కొండూరు

ప్రజాధనం దుర్వినియోగం!

(5వ పేజీ తరువాయి)

28వ తేదీన రూ.3.74 లక్షలను అదే కాంట్రాక్టర్ పేరున బిల్లు చేశారు. ఈ నిధులు ఏ పని కోసం చెల్లించారో తెలియజేయకపోవడం గమనార్హం. ఈ ఏడాది జనవరి 24వ తేదీన ఓ కంపెనీ పేరుతో మచిలీపట్నం మెడికల్ కళాశాలకు తాగునీటి పనుల కోసం రూ.1.57 కోట్లను బిల్లులు చేసినట్లుగా చూపారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలకు సంబంధించి మునిసిపల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి బిల్లులు మంజూరు చేయాల్సి ఉండగా, మునిసిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి బిల్లులు చేయడం విశేషం.

- కమిషనర్ కారు అద్దె ప్రాతిపదికన ఉంది. ఈ కారుకు మరమ్మతుల పేరుతో రూ.85 వేలు, ఎంఈ కార్ బిల్లులకు రూ.32 వేలు ఇచ్చారు. ఎంఈకి కారు లేకున్నా బిల్లులు పెట్టినట్లు సమాచారం. మునిసిపల్ కమిషనర్ కారు అద్దెది కాగా, కారు యజమాని రిపేర్లను చూసుకోవాలని, కానీ మునిసిపల్ నిధులను ఇచ్చారని, ఇది నిబంధనలకు విరుద్ధమని కార్యాలయ ఉద్యోగులు అంటున్నారు. ఆయిల్ బిల్లుల పేరుతో రూ.3.25 లక్షలను బిల్లులను ఈ ఏడాది మార్చి 15వతేదీన మంజూరు చేయడం గమనార్హం. ఏ బిల్లులైనా సీఎఫ్ఎంఎస్ ద్వారానే చేయాలని మునిసిపల్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. కానీ ఏ కారణంతో చెక్కుల రూపంలో బిల్లులు చేశారనే అంశంపై విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కొందరు మునిసిపల్ కార్యాలయ అధికారులు అంటున్నారు.



ఉత్కంఠగా ఉమ్మడి కృష్ణా వాలీబాల్ పోటీలు

కానూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానూరులోని వీపీపీ సిద్ధార్థ కళాశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి కృష్ణా వాలీబాల్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈషా 17వ గ్రామీణోత్సవ పోటీల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి మొత్తం 24 జట్లు హాజరయ్యాయి. ఉత్కంఠగా జరిగిన పోటల్లో ప్రథమ స్థానాన్ని జీవన్ నగర్, ద్వితీయ స్థానాన్ని వెల్లటూరు జట్లు కౌవశం చేసుకున్నాయి. విజేతలకు డీసీపీ ఎస్‌జీవీ సరిత బహుమతులు అందజేశారు. ఈషా గ్రామీణోత్సవ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు సెప్టెంబరు 7న విజయవాడలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు కొయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్ ఆది యోగి ఆవరణలో సద్గురు సమక్షంలో సెప్టెంబరు 21న జాతీయస్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

నవంబరు 7, 8, 9 తేదీల్లో రెవెన్యూ క్రీడలు

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

గాంధీనగర్ : నవంబరు 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పరిపాలనలో రెవెన్యూశాఖ పాత్ర కీలకమని, ఈ శాఖలోని అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని పిలుపునిచ్చారు. శాఖలో కొత్తగా చేరే వీఆర్‌ఏ నుంచి తహసీల్దార్ స్థాయి వరకు నూతన టెక్నాలజీ, చట్టాలపై అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేశ్, సహాధ్యక్షుడు పితాని త్రినాథరావు, ఉపాధ్యక్షుడు జీవన్‌చంద్ర శేఖర్, ఎన్.శ్రీనివాస్, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం

- మద్యం మత్తులో కత్తితో దాడి
- ఖమ్మం జిల్లాలో ఘటన

మధిర రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి మద్యం మత్తులో దారుణానికి ఒడిగట్టాడు. ఆరునెలల గర్భిణి అని కూడా చూడకుండా కత్తితో దాడిచేసి హతమార్చబోయాడు. అదృష్టవశాత్తు తప్పించుకున్న ఆమె ప్రాణాలతో బయటపడగా.. భర్త పరారయ్యాడు. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడలో లారీ డ్రైవర్‌గా పనిచేసే మాటూరు గ్రామానికి చెందిన చిల్లా సూర్యనారాయణ, మంగళగిరికి చెందిన సాయి నాగలక్ష్మి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఏడు, నాలుగేళ్ల వయస్సు ఉన్న ఇద్దరు కుమారులు ఉండగా నాగలక్ష్మి ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. వీరి కాపురం కొంతకాలం సజావుగా సాగగా.. సూర్యనారాయణ భార్య నాగలక్ష్మిపై అనుమానం పెంచుకోవడంతో ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. సూర్యనారాయణ మద్యానికి బానిసై పనికి సరిగా వెళ్లడం లేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి తిరిగొచ్చిన సూర్యనారాయణ.. వచ్చేటప్పుడు ఓ కత్తిని తెచ్చుకున్నాడు. పిల్లలు ఇద్దరూ నిద్రలో ఉండగా భార్యాభర్తల మధ్య గొడవ జరగ్గా.. అర్ధరాత్రి 12 గంటల సమయంలో భార్య నాగలక్ష్మి మెడపై కత్తితో దాడిచేసి విచక్షణారహితంగా పొడిచాడు. నాగలక్ష్మి ఇంటినుంచి బయటికి పరుగు తీయగా స్థానికులు ఆమెను అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మి ప్రస్తుతం మధిరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మధిర రూరల్ పోలీసులు ఆదివారం మాటూరు గ్రామానికి వెళ్లి ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. సూర్యనారాయణ కోసం గాలిస్తున్నారు.

అతివేగానికి ఒకరి బలి

గుణదల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతున్న వ్యక్తి రోడ్డు దాటుతున్న వృద్ధుడ్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందగా ప్రమాదానికి కారణమైన వ్యక్తి కాళ్లు, చేతులు విరిగిన ఘటన ఆదివారం రాత్రి నిడమానూరు వద్ద జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చర్చిల్లో ఫాదర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన నప్పవరపు వలేరియా(72) వాకింగ్ నిమిత్తం జాతీయ రహదారిపై రోడ్డుదాటుతున్న క్రమంలో పెదపాడుకు చెందిన డి.వర్ధన్ (26) మోటారు బైక్‌పై అతివేగంతో వచ్చి ఢీకొట్టాడు. ఫాదర్ వలేరియా అక్కడికక్కడే మృతిచెందగా.. వర్ధన్ కాళ్లు, చేతులు విరిగాయి. పటమట పోలీసులు వర్ధన్‌ను ఆసుపత్రికి తరలించారు. ఫాదర్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పటమట సీఐ కిషోర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఆళ్ల



హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ఎడమ కాలువ పీసీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తన జన్మదినం పురస్కరించుకొని ఆదివారం స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు అర్చన జరిపి తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రంతో సత్కరించి ఆశీస్సులు అందజేశారు. ఆయన వెంకట టీడీపీ నాయకులు గుండపనేని ఉమా వరప్రసాద్, మండాది రవీంద్ర తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు
మట్టి గణపతికి జై

- వీరవల్లిలో తయారవుతున్న వేలాది మట్టి గణపతులు
- శాలివాహన కాలనీలో 70 కుటుంబాలకు ప్రధాన వృత్తి
- మట్టి దొరక్క తగ్గిన తయారీ

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్)

పచ్చటి పండుగ వినాయకచవితి సమీపిస్తున్న కొద్దీ మట్టి గణపతి విగ్రహాల సందడి మొదలైంది. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై పెరుగుతున్న అవగాహనతో మట్టి గణపతి విగ్రహాల తయారీ కూడా భారీగా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్లాస్టర్ ప్యారిస్ విగ్రహాలకు దూరం జరుగుతూ అదే ధరలో తయారవుతున్న మట్టి విగ్రహాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. మట్టి విగ్రహాల తయారీకి వీరవల్లిలోని శాలివాహన కాలనీ పెట్టింది పేరు. కొన్ని దశాబ్దాలుగా సుమారు 50-70 కుటుంబాల వారు మట్టితో మమేకమై గణపతి విగ్రహాలతో పాటు వంట పాత్రలను, బొమ్మలను, విభిన్న అకృతులను తయారు చేయడం కుటుంబాలకు తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఇప్పటికే 20వేల విగ్రహాలు మనరాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తోడు తెలంగాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతులు మొదలయ్యాయి. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింతగా రాణించి ప్లాస్కులు లాంటివి కూడా మట్టితో తయారు చేయగలమని కొందరు చేయి తిరిగిన కళాకారులు చెపుతున్నారు.

గణపతి అంటేనే పచ్చని ప్రకృతితో మమేకయ్యే పండుగ. వినాయకచవితిలో వాడే పత్రి కూడా ప్రకృతికి సంబంధించింది. వినాయకుడిని ప్రకృతి సిద్ధంగా లభించే ఆకులు, పూలతోనే పూజిస్తారు. మట్టి గణపతులను పూజించేలా ప్రజలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు, లయన్స్, వాసవి లాంటి స్వచ్ఛంద సంస్థలు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. పీఓపీ(ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్)ను పూర్తిగా నివారించలేకపోయినా చాలా మంది ప్రజలు మట్టి గణపతులనే పూజిస్తున్నారు. పండుగ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించేలా ప్రభుత్వం, పర్యావరణ హితులు కూడా అవగాహన కల్పిస్తున్నారు.



ఎగుమతికి సిద్ధమైన మట్టి గణపతి విగ్రహాలు

మట్టి విగ్రహాల తయారీలో అన్నీ పర్యావరణ హితమే..

మట్టి విగ్రహాల తయారీలో ఉపయోగించే చెక్క, కొబ్బరిపీచు, మట్టి లాంటివి అన్నీ పర్యావరణ హితమేనని తయారీదారులు తెలిపారు. వీరవల్లి శాలివాహన కాలనీలో సుమారు 30 నుంచి 40వేలకు పైగా చిన్నపాటి విగ్రహాల నుంచి ఐదు అడుగుల విగ్రహాల వరకూ తయారు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటికే వారికి వచ్చిన ఆర్డర్ల ఆధారంగా ఎగుమతి చేసేందుకు విగ్రహాల తయారీలో కుటుంబాలు తలమునకలయ్యాయి. మట్టి విగ్రహాలతో పర్యావరణానికి ఎటువంటి ముప్పు ఉండదు. నిమజ్జనం చేసిన వెంటనే కరిగిపోతాయి. ఇప్పటికే వేలాదిగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు.

మట్టి కొరత వేధిస్తోంది



వినాయకచవితి వచ్చిందంటే వీరవల్లి శాలివాహన కాలనీకి పండగ వస్తుందని, గతంలో కలకత్తా, హైదరాబాద్, ఒడిస్సా లాంటి ప్రదేశాలకు వేలాదిగా ఎగుమతి చేసే వారం. ప్రస్తుతం మట్టి కొరత వేధిస్తోంది. నేరుడుగుంట నుంచి వచ్చే మట్టి రావడం లేదు. దేవరగుంట, నూజివీడు ప్రాంతాల నుంచి మట్టి తెచ్చుకుంటున్నాం. మట్టి అందుబాటులో ఉంటే భారీ విగ్రహాలను కూడా తయారు చేసి ఎగుమతి చేయగలం.

\- కొండలరావు, తయారీదారు

ప్రభుత్వం ప్రోత్సహిస్తే వంట సామగ్రి తయారు చేస్తాం



గత టీడీపీ హయాంలో ఇచ్చిన ఆదరణ పథకాలను ఇప్పటికీ ఉపయోగిస్తూ మట్టి కుండలు, గణపతి విగ్రహాలు తయారు చేస్తున్నాం. సబ్సిడీ రుణాలతో పాటు పరికరాలను అందించి ప్రోత్సహిస్తే మట్టితో వంట పాత్రలు కూడా తయారు చేయగలం పర్యావరణ పరిరక్షణకు మావంతు సహకారం అందిస్తాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. తమకు రుణాలు వెంటనే అందజేయాలి.

\- లక్ష్మి, తయారీదారు



పోరంకి పార్టీ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పేదలకు సీఎం సహాయనిధి వరం

పెనమలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బడుగు బలహీన వర్గాల వారి ఆర్థిక తోడ్పాటుకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో కంకిపాడు, పెనమలూరు మండలాలు, తాడిగడప మునిసిపాలిటీకి చెందిన 14మందికి 9.83 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గడచిన ఏడాది కాలంలో 782మంది నిరుపేదలకు రూ. 7.27 కోట్ల మేర సాయం అందించడం ఆనందదాయకమన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, తుమ్మల రాంకుమార్, తోటకూర ఉదయభాస్కర్, దోనేపూడి రవికిరణ్, బొంగరాల అబ్రహం, శుభోఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నేడు

గుడివాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముగ్గుబజారులోని స్కిల్ కళాశాలలో ఈ నెల 25న వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటర్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో హాజరయ్యే వారి వయస్సు 18 నుంచి 30 లోపు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, పెంజర్లలో పనిచేయాలని, పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చదివిన పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ఆ ప్రకటనలో కోరారు.

కొండాలమ్మకు పొంగళ్లు సమర్పించిన భక్తులు

గుడ్లవల్లేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి, అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇండియా కూటమి నాయకులు

రాహుల్‌గాంధీ పోరాటానికి అండగా ఉందాం

ఇండియా కూటమి పార్టీల నాయకులు

పెనమలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పాలక బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఓట్ల చోరీ ఘటనలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోరీ-గద్దె చోర్ ఆందోళనల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఇండియా కూటమి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విజయలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెసు పార్టీ రాష్ట్ర ప్రతినిధి భుజంగ నాయక్, సీపీఐ కార్యదర్శి మున్నంగి నరసింహరావు, మోతుకూరి అరుణ్ కుమార్, వెలిసెల సుబ్రహ్మణ్యం, కొసనం రాములు మాట్లాడుతూ, బీజేపీ పాలనలో రాజ్యాంగ లౌకిక హక్కుల్ని కాలరాయడం జరుగుతోందని, రాహుల్ గాంధీ చేపట్టిన యాత్రకు ఉత్తర భారతదేశంలో ప్రతి ఒక్కరూ మద్దతిస్తున్నారని, దక్షిణ భారత పౌరులందరూ కూడా మద్దతు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాటపల్లి ఇజ్రాయల్, కిలారు వెంకటరత్నం, తమ లంఝాన్సీరాణి, తోటకూర రాధిక మాధవి, బాలాజీ నాయక్, గుర్రం వెంకటరామారావు, కైలే సునీల్, ఈదర రాజశేఖర్ వర్మ, ముస్తాక్, రాంబాబు, మొక్కపాటి సుధీర్, రవికుమార్, తేరా నరేష్, ఆరే ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఆర్కే బోర్‌వెల్స్ అధినేత మేడికొండ రామకృష్ణ

అయ్యప్పస్వామి దేవాలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే బోర్‌వెల్స్ అధినేత మేడికొండ రామకృష్ణ బాపులపాడు శివాలయంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయానికి ఆదివారం రూ.50 వేలు విరాళం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నాకు చెక్కు రూపంలో విరాళం అందజేశారు. ఆర్కే కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, గూడవల్లి రత్నశేఖర్, తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ కోలుకోవాలని ప్రార్థనలు

ఉంగుటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా వైరల్‌ఫీవర్ (టైఫాయిడ్)తో బాధపడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన అనారోగ్యం బారినుంచి త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి పునరంకితం కావాలని కోరుతూ టీడీపీ ఉంగుటూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో 101 కొబ్బరికాయలు కొట్టిన నాయకులు ఆ తర్వాత ఫాదర్ నేతృత్వంలో తంబి సమాధివద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలుసు రవీంద్రబాబు, కుందేటి చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆరికట్ల రవికుమార్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి, ఆళ్ల హనోక్, పోతినేని రామకృష్ణ, మేడేపల్లి సురేష్, బొడ్డపాటి రవి, ఈసరి రవికుమార్, కంభంపాటి సాయి, కిట్టయ్య, సాయి, నిఖిల్, కాట్నేని బ్రదర్స్, రెబ్బా తంబి, కుందేటి నాని, తుల్లిమిల్లి ఇన్నాసు తదితరులు పాల్గొన్నారు.



పెదఅవుటపల్లిలో తంబి సమాధి వద్ద ప్రత్యేకప్రార్థనలు చేస్తున్న టీడీపీ నాయకులు

పీ4 స్ఫూర్తితో గ్రామాల్లో అత్యాధునిక వైద్యసేవలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 కార్యక్రమ స్ఫూర్తితో జిల్లాలో మొట్ట మొదటిగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించడం అభినందనీయమని తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో త్రినాథ్ అన్నారు. కానుమోలు హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో ది హనుమాన్ జంక్షన్ రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ శివప్రసాద్ హృదయాల, శంకర నేత్ర చికిత్సాలయ (శంకర గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ అండ్ రీసెర్చ్ సెంటర్) వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. కానుమోలు, ఆరుగొలను, పెరికీడు, కాకులపాడు, రంగయ్యప్పారావుపేట, రామన్నగూడెం, తిప్పనగుంట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు (సుమారు 596 మందికి పైగా) అధికసంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ స్వాతి, ప్రొఫెసర్ డాక్టర్ పొట్లూరి రవికిరణ్ డాక్టర్ యువాన్ ఆధర్యంలో 234మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. కంటి శుక్లాలకు శస్త్రచికిత్స అవసరమైన 23 మందికి ఉచితంగా ఆపరేషన్ చేసేలా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరాన్ని కృష్ణాజిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్ ఏరియా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి స్వప్నకుమార్, కార్యదర్శి బళ్లా వీరవెంకటరావు, జిల్లా నాయకుడు పొట్లూరి సీతారాంప్రసాద్, పొట్లూరి రాము, పవన్ కుమార్, కొల్లి రాజీవ్, తదితరులు పర్యవేక్షించారు. మాజీ సర్పంచ్ చింతల వెంకటశివ అప్పారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ దన్నే దుర్గారావు, టీడీపీ నాయకులు చలసాని శ్రీనివాస్, వేగిరెడ్డి పాపారావు, వేములపల్లి శ్రీనివాసరావు, లింగం కిషోర్, ప్రసాద్, నందూరి శర్మ, వీరపనేని రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో త్రినాథ్

కష్టపడిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుంది

కొండాకు సముచిత స్థానం అభినందనీయం

కంకిపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కోసం పాటుపడిన కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సముచిత స్థానం కలిపిస్తారని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కొండా నాగేశ్వరరావును ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి హరికృష్ణ మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను బోడె ప్రసాద్ గుర్తుంచు కుంటారన్నారు. పార్టీ కోసం పాటుపడిన వారికి బోడె ప్రసాద్ అండగా ఉంటారని కొండా నాగేశ్వరరావు, కొండా ప్రవీణ్ నియామకమే నిదర్శనమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంక టరమణ, పార్టీ నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయ ప్రకాష్, వణుకూరు విక్రం, వీరంకి శ్యామ్, పచ్చిపాల రాజ, వడ్డాది శ్రీను, అన్నవరపు శివపార్వతి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కొండా నాగేశ్వరరావును సత్కరిస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ

ఎవరికి ఎంత ఇచ్చారో!

- ఎరువుల అమ్మకాల్లో అవకతవకలు
- బిల్లుల్లో కొట్టివేతలు, దిద్దుళ్లు
- మూడేళ్లుగా గోదాములో నిల్వ ఉన్న లిక్విడ్ యూరియా, ఇతర మందులు
- ఆందోళనలో కలవపాముల పీఏసీఎస్ రైతులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

కలవపాముల పీఏసీఎస్ అవకతవకలకు నిలయంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువుల అమ్మకాల్లో అవకతవకల నుంచి రుణాలు మంజూరు, రుణం చెల్లించిన వారికి షేరుధనం చెల్లింపుల్లో జాప్యం, సంవత్సరాల తరబడి గోదాములో మూలుగుతున్న ఎరువులు, ఇతర మందులు కొనే వారులేక వినియోగించే గడువు దగ్గరపడి సంఘం లక్షల్లో నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని రైతుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యూరియా అమ్మకాల్లో అవకతవకలు జరిగాయని, రైతుకు ఇచ్చే బిల్లులో ఒక సంఖ్య డూప్లికేట్ బిల్లుల్లో మరొక సంఖ్య ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. జూలైలో ఒక్కొక్కరికి 20 నుంచి 30 బస్తాలు విక్రయించినట్టు బిల్లుల్లో చూపగా, ఆగస్టులో విక్రయించిన 132 బస్తాల యూరియాకు సరిగా బిల్లులో లేకపోగా యూరియా తీసుకోనివారి పేర డూప్లి కేట్ బిల్లుల్లో 20 నుంచి 30 బస్తాలు ఇచ్చినట్టు రాయడం విశేషం. గత ప్రభుత్వ హయాంలో అంతగా గుర్తింపు లేని కంపెనీలనుంచి కొనుగోలు చేసిన లిక్విడ్ యూరియా, ఇతర మందులు మూడేళ్లుగా కొనేవారు లేక గోదాములో నిల్వ ఉన్నాయి. (ఎక్స్‌పైరీ డేట్) మించిపోతున్న నేపథ్యంలో షుమారు రూ. 8 లక్షలు సంఘం నష్టపోవాలసిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు షుమారు 89 టన్నుల యూరియా రాగా ఎవరికి ఎంత ఇచ్చారో స్పష్టతలేదు.



మూలుగుతున్న లిక్విడ్ యూరియా,ఇతర మందుల పెట్టెలు



బిల్లుల్లో కొట్టివేతలు

బాధ్యతలు చేపట్టను: చైర్‌పర్సన్

సంఘంలో అవకతవకలు జరిగాయని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన చైర్‌పర్సన్ కలపాల మల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించలేదు. ప్రభుత్వం అవకతవకలపై నిగ్గు తేల్చే వరకు బాధ్యతలు చేపట్టేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఎరువుల అమ్మకాల్లో ఆరోపణలపై సీఈఓ నాకేమి తెలియదు, సేల్స్‌మేన్ చూసుకుంటుందనడం విశేషం.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540	



ఘనంగా కొండాలమ్మకు పొంగళ్లు

గుడ్లవల్లేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లను సమర్పించారు. ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా గుడ్లవల్లేరు పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.



ఆలయంలో పొంగళ్లతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలు నేటి నుంచి

గుడివాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని అండర్-14, అండర్-16 విభాగాల్లో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలను సోమవారం గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పోటీలను ప్రారంభిస్తారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులకు 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గెలపొందిన వారికి బహుమతులను అందించనున్నామన్నారు.

శాకాహార ర్యాలీ

గుడ్లవల్లేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు ఆత్మ విద్య పిరమిడ్ ధ్యాన మందిరం వారి ఆధ్వర్యంలో ఆదివారం మహా కరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. జీవ హింసమహా పాపమని మాంసాహారం మాని శాఖాహారులుగా మారాలని తెలుపుతూ ఈ ర్యాలీని నిర్వహించారు. కౌతవరం ఫస్ట్ వార్డులోని ధ్యాన మందిరం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఫస్ట్ వార్డు వీధుల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం వేమవరం కొండాలమ్మ ఆలయ ప్రాంతంలో ఈ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ధ్యాన మందిర నిర్వాహకులు బాల ప్రసూనాంబ, సభ్యులు వైవీసీ ప్రసాద్, కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లు బాగుపడేదెన్నడో..!

- ముత్రాసిపాలెం వెళ్లే రోడ్డు అధ్వానం
- వాహనదారులకు తప్పని సర్కస్ ఫీట్లు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : మంటాడ- లంకపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ముత్రాసిపాలెం వెళ్లేరోడ్డు పొడవునా గోతులతో నిండి ఉంది. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో వర్షపునీరు నిలిచి బురదకయ్యగా తయారవుతున్నాయి. కపిలేశ్వరపురం పంచాయతీ పరిధిలో పొలాల మధ్య దూరంగా విసిరివేసినట్టు ఉండే ముత్రాసిపాలెం బయట ప్రపంచానికి రావడానికి ఇదే రోడ్డును ఉపయోగిస్తుంటారు. రోడ్డుపొడవునా గోతులు ఏర్పడి వర్షానికి నీరు నివడంతో ఏది రోడ్డో, ఏది గోతో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వర్షాలకు రోడ్డుపై



బురదకయ్యగా ముత్రాసిపాలెం రోడ్డు



గుంతలమయంగా కపిలేశ్వరపురం రోడ్డు

రబ్బిస్ కొట్టుకుపోయి బురద కయ్యగా మారడంతో నడిచి వెళ్లే అవకాశం లేక గ్రామస్థులు నరకయాతన పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి పోతున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో ప్రమాదాల బారీన పడక తప్పడం లేదు. రోడ్డు దుస్థితిపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాల్లేవని విమర్శలు వినవస్తున్నాయి. ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రయాణం నరకం

గోతులమయంగా ఉన్న రోడ్డుపై వెళ్లాలంటే నరకం కన్పిస్తుంది. వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి, రబ్బిష్ కొట్టుకుపోయి బురదకయ్యగా తయారవడంతో ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. ఊరినుంచి బయటకు వచ్చేందుకు ఇదే రోడ్డు ఉపయోగించవలసిన పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నాము.

కె. శ్రీనివాసరావు, గ్రామస్తుడు

పట్టించుకున్నవారు లేరు

గోతులమయంగా ఉన్న రోడ్డు బాగుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భయపడాల్సి వస్తోంది. అనారోగ్య పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే మోటార్ సైకిల్‌పై సైతం వెళ్లలేని పరిస్థితుల్లో ఆటోల వారు రావడంలేదు.

పి.సుబ్బారావు, గ్రామస్తుడు

స్కిల్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నేడు

గుడివాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : స్థానిక ముగ్గుబజారులోని స్కిల్ కళాశాలలో ఈ నెల 25వ తేదీన వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హాజరయ్యేవారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటర్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకురావాలి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాలు లోపు ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, పెంజర్లలో పనిచేయాల్సి ఉంటుంది. పదవ తరగతి, ఇంటర్, ఏదైన డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చదివిన పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రకటనలో కోరారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా వాసే మురళీ

గుడివాడ రూరల్ : టీడీపీ గుడివాడ రూరల్ మండల అధ్యక్షుడిగా వాసే మురళీ ఎన్నిక కావటం పట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం అభినందనలు తెలిపారు. ఆదివారం వాసే మురళీ స్వగృహంలో టీడీపీ నాయకులు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గుడివాడ రూరల్: స్థానిక టిడ్కోకాలనీలో నివాసముంటున్న టెంటు వేణు (32) గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంటిబాబు ఆదివారం తెలిపారు. టెంటు వేణు ఈ నెల 15వ తేదీన గడ్డిమందు సేవించగా, గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతుని తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

కుప్పకూలిన నెహ్రాల్లి కల్వర్టు .. తప్పని తిప్పలు

నందివాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత ఆరు సంవత్సరాలుగా నందివాడ నెహ్రాల్లి కల్వర్టు ప్రమాద అంచుల్లో ఉంది. నూతన కల్వర్టు నిర్మించటం మహాప్రభో అంటూ నందివాడ గ్రామస్థులు, వాహనదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటంతో ఆదివారం ఉదయం నెహ్రాల్లి కాలువ కల్వర్టు కూలిపోయింది. వంతెన కూలిన విషయం తెలుసుకున్న వెనిగండ్ల హుటాహుటిన వంతెన వద్దకు వచ్చి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రాకపోకలకు అంతరాయం కలుగకుండా తగు చర్యలు చేపట్టాలని వెనిగండ్ల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ ఈ నెహ్రాల్లి ఛానల్ ద్వారా సుమారు 15 వేల ఎకరాలకు నీరు సరఫరా అవుతుందన్నారు. కాలువ ద్వారా నీళ్ల క్రమంగా నడిచే విధంగా చర్యలు చేపడతామన్నారు. దోసపాడు ఛానల్ నెహ్రాల్లి డ్రైన్ మధ్య కల్వర్టు నిర్మించేందుకు ఇప్పటికే రూ.35.75 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. వర్కు ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపామన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డిఈ భరత్ మాట్లాడుతూ కాంట్రాక్టరుతో తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వంతెన ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. భారీ వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నామన్నారు. ప్రస్తుతం కాలువలు నిండుగా ఉండటంతో రెండు నెలలు ఆగి వంతెన నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాత్రగడ్డ రవి, పాల్గొన్నారు.



నెహ్రాల్లి కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

చవితి ఉత్సవాలకు గణేశ్ మండపాల ముస్తాబు

కూచిపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల కోసం మొవ్వ మండలం కూచిపూడిలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన వినాయకుని విగ్రహాలకి డిమాండ్ పెరిగి వాటి తయారీ కేంద్రం సందడిగా మారింది. అడుగు విగ్రహం నుంచి పది నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలను రాజస్థాన్ కళాకారులు తయారు చేశారు. విగ్రహాలను అడ్వాన్స్ (బజానా) ఇచ్చి బుక్ చేసుకుంటున్నారు. మండలం నుంచే కాకుండా ఘంటసాల, పమిడిముక్కల మండలాలతోపాటుగా పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు తరలివస్తున్నారు. గతంలో మచిలీపట్నం సమీపంలోని వలందపాలెంకు విగ్రహాల కోసం ట్రాక్టర్లు వేసుకొని వెళ్లేవారు. కూచిపూడి విగ్రహాల తయారీ కేంద్రం ఉండటంతో రానుపోను ఖర్చులు కొంత మేర కలసి వస్తాయని ఈ ప్రాంతాల్లోని కేంద్రానికి తరలిరావటంతో విగ్రహాలకు డిమాండ్ పెరిగింది.



కూచిపూడిలో రూపుదిద్దుకుంటున్న వినాయక విగ్రహాలు



గణేశ్ ఉత్సవాలకు ముస్తాబవుతున్న గణేశ్ మండపం

పామర్రు : గణనాథుడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణేష్ మండపాలను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. స్థానిక ఆంధ్రాబ్యాంకు బజార్, పాత రిజాస్టార్ కార్యాలయ బజారు, జమ్మిచెట్టుబజారు, బాపూజీపేట, శాలివాహనపేట, వైష్ణవాలయం బజారు, కోటిరెడ్డిపేట, గాంధీనగరం, రాపర్ల, ఉంద్రపూడి, జమీదగ్గుమిల్లి, పెదమద్దాలి, అడ్డాడ, కొత్తపెదమద్దాలి, నిమ్మకూరు, జుజ్జవరం, తదితర గ్రామాల్లో గణేష్ మండపాలు ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

గుడివాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరిండంతోపాటుగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ ఎస్సై పూడి నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక నాగవరప్పాడులో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో ట్రాఫిక్ నియమ,నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై నాగరాజు

బెయిలీ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి

● శీలం నారాయణరావు

కూచిపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవిలోని బెయిలీ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టి ఆర్టీసీ బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని సీపీఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. 2 సంవత్సరాల క్రితం ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన తాత్కాలిక బెయిలీ బ్రిడ్జి (ఇనుప వంతెన) నిర్మించారని, ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మొవ్వ మండల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అలాగే మచిలీపట్నం నుంచి మండల కేంద్రమైన మొవ్వవైపు వెళ్లే పలు సర్వీసులు ఆర్టీసీ వారు తొలగించటం ద్వారా ఉద్యోగ, వ్యాపారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నిడుమోలు, ఆవిరిపూడి, చినముత్తేవి, మంత్రిపాలెం, పాలంకిపాడు, కారకంపాడు, యద్దనపూడి తదితర గ్రామాలకు చెందిన మహిళా ప్రయాణికులు ఈ ప్రాంతంలో బస్సు సర్వీసులు నిలిపివేయటంతో వారు ఉచిత బస్సు సౌకర్యం పొందలేకపోతున్నారని తెలిపారు. బెయిలీ బ్రిడ్జి శాశ్వత నిర్మాణ పనులు చేపట్టడంతోపాటు మచిలీపట్నం నుంచి మొవ్వ వైపు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని నారాయణరావు కోరారు.



దెబ్బతిన్న బెయిలీ బ్రిడ్జి

రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి

● బోయిన సాంబశివరావు

పెదపారుపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అత్యవసరమైన యూరియా ఎక్కడా నిల్వ లేకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మోపర్రు నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు బోయిన సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో ఐదు సహకార సంఘాలు ఉండగా, వాటిలో ఒక్క దానిలోనూ ఎక్కడా యూరియా నిల్వలు లేవన్నారు. దీంతో రైతులు పొలాలకు యూరియా వేయాలంటే ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పొలాలకు సకాలంలో ఎరువుల వాడటం ద్వారానే దిగుబడులు సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. కానీ యూరియా కొరత కారణంగా వరి పైర్లకు సకాలంలో వేయలేకపోవటం వల్ల దిగుబడి నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతులకు పూర్తిగా అందుబాటులో యూరియా ఉంచామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయ అధికారులు స్పందించి వెంటనే యూరియా అందేలా చూడాలని ఆయన కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు దృష్టి సారించి యూరియా సరఫరా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సకాలంలో యూరియా అందించటం ద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు.



సాంబశివరావు,

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెదపారుపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి మండలంలోని రౌడీషీటర్లకు ఏఎస్సై ప్రకాశరావు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లకు పాల్పడవద్దని వారిని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగటం ద్వారా వారిపై రౌడీషీట్లను తీసివేయించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. గతంలో జరిగిన విషయాలను మననం చేసుకోకుండా రానున్న కాలంలో అందరితో కలసి ఉండే విధంగా మసలుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే దగ్గుబాటి క్షమాపణ చెప్పాలి

గుడివాడ : జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం రూరల్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ బహిరంగ క్షమాపణ చెప్పాలని గుడివాడ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఎమ్మెల్యే దగ్గుబాటికి వ్యతిరేకంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసన తెలుపుతూ ఎమ్మెల్యే ఫోటోను దగ్ధం చేశారు. తొలుత అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి నివాళులర్పించారు. అభిమానులు హరి, సుధీర్, మాణిక్యం, కోటిబాబు, పృథ్వీ, సురేంద్ర, కార్తీక్, నవీన్, వంశీ,రవి వంశీ, రవితేజ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా యక్కల

గుడివాడ : గణేష్ ఉత్సవ సమితి జిల్లా ఉపాధ్యక్షునిగా గుడివాడ కు చెందిన యక్కల మణిదీప్ నియమితులయ్యారు. ఆదివారం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఆడిటోరియంలో రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ పాల్గొని మాట్లాడుతూ ధార్మిక, సామాజిక, పర్యావరణ పరిరక్షణ చేస్తూ వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యక్కల మణిదీప్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా, జన్ను వీరబాబును జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించారు. కూరాళ్ళ శ్యాంసుందర్, మూడెడ్ల శ్రీధర్, ఇడపలపాటి జగత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లేరుకాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

పమిడిముక్కల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :మంటాడ వంతెన వద్ద పుల్లేరుకాల్వలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా నిల్వడంతోపాటు కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో వంతెన పైగా వెళ్లేవారికి తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. కాల్వలో ఎగువ ప్రాంతం నుంచి ప్లాస్టిక్‌వ్యర్థాలు, వస్తువులు, చెత్త, ఇతర వ్యర్థాలు కొట్టుకువచ్చి వంతెన వద్ద ఉన్న ఎండిపోయిన గుర్రపు డెక్కలో నిలిచి పోయాయి. వ్యర్థాలు దిగువకు పోయే వీలులేక కుళ్లి భరించలేని దుర్గంధం వ్యాపిస్తుంది. వంతెనకు సమీపాన శివాలయానికి వచ్చే భక్తులు దుర్గంధం భరించలేక ఆలయంలో దైవ సన్నిధిన కొద్దిసేపు ప్రశాంతంగా గడిపేందుకు అవకాశం లేక అసౌకర్యానికి గురవుతున్నారు. పక్కనే శ్మశానవాటిక కూడా ఉన్న పరిస్థితుల్లో అక్కడ కు వచ్చే వారు కాల్వలోకి దిగాలంటే ఇబ్బంది పడుతున్నారు.



పుల్లేరుకాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

పేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం, దుప్పట్ల పంపిణీ నిర్వహించారు. వేమవరం గ్రామానికి చెందిన పామర్తి వెంకటపతి జ్ఞాపకార్థం వారి సోదరుడు పామర్తి ఏడుకొండలు(కొండబాబు), వారి కుటుంబ సభ్యులచే పేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, జంగం మోహనరావు, పోలవరపు వెంకటరావు, కొండబాబు, నరసింహారావు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి

● పామర్రు సీఐ వి.సుభాకర్



గణేష్ మండపాలను పరిశీలిస్తున్న సీఐ హనీష్

పామర్రు, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గణేశ్ మందిరాలు ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని పామర్రు సీఐ వి.సుభాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేశ్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో గ్రామాలలో పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. డిజేల సౌండ్‌ను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేదిలేదన్నారు.అశ్లీల నృత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాధ్యమైనంత వరకు నిమజ్జనాలను సాయంత్రం 6 గంటల లోపే ముగించుకోవాలని ప్రజలకు సూచన చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజేంద్రప్రసాద్, ట్రైనీఎస్సై సత్యకళ పాల్గొన్నారు.

గుడివాడ : టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలను తీసుకోవాలని టూటౌన్ సీఐ హనీష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాలను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసే మండపాలకు పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరి అని అన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రజలు విజయవంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సీఐ హనీష్ కోరారు.

నందివాడ: మండలంలో గణేశ్ నవరాత్రులు సందర్భంగా గణేషునికి చలువ పందిళ్లు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులచే ఆదివారం తమిరిశ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నందివాడ ఎస్సై శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో వినాయకుని చలువ పందిళ్లు ఏర్పాటు చేసే వాళ్లు తప్పనిసరిగా కమిటీని ఏర్పాటు చేసుకుని ఆ కమిటీ సభ్యుల పేర్లు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గంగారాజు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.7.46 లక్షలు



మోపిదేవి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆదివారం ఒక్కరోజే వివిధ సేవా రుసుముల ద్వారా రూ.7,46,216 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మాలెంపాటి సీతారామాంజనేయులు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రంగనాథ్‌బాబు, బంతేజి

మాలెంపాటి, అత్తలూరి సేవలు చిరస్మరణీయం

ఘంటసాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మాలెంపాటి సీతారామాంజనేయులు, అత్తలూరి వెంకట పిచ్చియ్య సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గోగినేనిపాలెంలో సీడీసీ మాజీ ఛైర్మన్ మాలెంపాటి సీతారామాంజనేయులు కాంస్య విగ్రహం, ఎన్జీ రంగా జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యవస్థాపకులు అత్తలూరి వెంకట పిచ్చియ్య విగ్రహాలను కుటుంబసభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సీతారామాంజనేయులు గోగినేనిపాలెం ప్రథమ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కృష్ణా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా, చల్లపల్లి చెరకు అభివృద్ధి మండలి ఛైర్మన్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. అత్తలూరి వెంకట పిచ్చియ్య కృషితో ఏర్పాటైన ఎన్జీరంగా జిల్లా పరిషత్ హైస్కూల్ వేలాది మంది విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహద పడిందన్నారు. సీతారామాంజనేయులు, వెంకట పిచ్చియ్య విగ్రహాలకు గొర్రెపాటి రంగనాథ్ బాబు నివాళులర్పించారు. బౌద్ధ భిక్షువు బంతేజీ బుద్ధ వందనం నిర్వహించారు. బాలికల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. భారత్ పేపర్ మిల్స్ పూర్వ అధ్యక్షుడు మాలెంపాటి వేణుగోపాలరావు, కంతమనేని అనంత ప్రసూన, అత్తులూరి దుర్గా ప్రసాద్, డాక్టర్ అత్తులూరి కోటేశ్వరరావు, మాలెంపాటి రాజేశ్వరి కోటేశ్వరరావు, యనమదుల మాధవి, యార్లగడ్డ సోమశేఖర్ ప్రసాద్ (లంకబాబు), జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భానుప్రకాష్, అత్తలూరి గోపిచంద్, తుమ్మల మురళీకృష్ణ, వేమూరి వెంకట్రావు, ముప్పనేని రవి ప్రసాద్, కుంపటి సుబ్బారావు, మునిపల్లి బుజ్జి, కుంపటి శరత్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఉపసర్పంచ్ నాని తదితరులు

డీఆర్వో సీసీ వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం

చల్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం పొందిన సందర్భంగా మిత్రబృందం ఆదివారం చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులోఆయనకు ఘన సన్మానం జరిగింది. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని తూము వెంకటేశ్వరరావును సత్కరించారు. ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్, ప్రముకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, బుల్లా కిషోర్, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, ఉప్పల సాంబశివరావు, మోర్ల శివ, అడపా గురవయ్య, జివి.తాతారావు, బోలెం రామారావు, పాలడుగు రత్నబాబు, దిరిశం వెంకట్రావ్, బత్తుల ప్రసాద్, వాకర్స్ యూనియన్ సభ్యులు తూము వెంకటేశ్వరరావును పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.



మూడోరోజూ ఎడ్లంక ప్రజల నిరసన

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వరద ముంపు నుంచి కాపాడాలని కోరుతూ పాత ఎడ్లంక గ్రామస్థులు మూడో రోజు కూడా నిరసన తెలిపారు. జిల్లా మాలమహానాడు అధ్యక్షులు దేవా గోవర్ధన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఎడ్లంక సమస్యను నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. గ్రామం చాలా వరకు కోతకు గురైందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. ఐదోవార్డు సభ్యుడు మెండు వనమాలి విజయ్ బాబు, గ్రామస్థులు పెమ్మాడి నాంచారయ్య, మునిపల్లి లాజరు, బందిల లక్ష్మణ్, కొల్లు గోపాలకృష్ణ, పెమ్మాడి నాంచారమ్మ, పెమ్మాడి లక్ష్మీ, కర్ర మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ యువ నేత బడే గౌతమ్ మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎడ్లంక కోతకు గురికాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వివాహిత ఆత్మహత్య

మోపిదేవి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పెదప్రోలు శివారు కప్తానుపాలెంలో సాలా నాగమణి (45) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నాగాయలంక మండలం పెదపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుతో విశాఖపట్నానికి చెందిన నాగమణికి వివాహం జరిగింది. ఐదేళ్లుగా కప్తానుపాలెంలో అద్దెకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఉద్యోగ రీత్యా ఢిల్లీ, విశాఖపట్నంలో ఉంటున్నారు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి తరచూ గొడవ పడుతున్నారని బంధువులు తెలిపారు. ఆదివారం ఉదయంభర్త శ్రీనివాసరావు ద్వారకా తిరుమల డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనం క్యారేజీ కోసం వచ్చి చూడగా, తలుపులు వేసి ఉన్నాయి. ఇంటి వెనుక వైపు వెళ్లి చూడాగా కిటికీకి చీరతో ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి మోపిదేవి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నాగమణి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



ఆళ్ల గోపాలకృష్ణతో కేక్ కట్ చేయిస్తున్న మంత్రి రవీంద్ర, కాల్వ శ్రీనివాసులు

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల మధ్య ఆళ్ల పుట్టినరోజు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ జన్మదిన వేడుక ఆదివారం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల మధ్య ఘనంగా జరిగింది. మనం ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి టీడీపీ సర్వసభ్య సమావేశంలో గోపాలకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా కేకు కట్ చేశారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, పరిశీలకులు కాల్వ శ్రీనివాసులు, గోవిందు సత్యనారాయణ, దామెర్ల సత్య, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందితో కలిసి సండే ఆన్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ ఆర్ గంగాధరరావు, సన్‌స్టార్ విద్యార్థుల సైకిల్ ర్యాలీ

వ్యాయామం దినచర్యలో భాగం కావాలి

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామాన్ని దిన చర్యలో భాగంగా మార్చుకుని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు 'ఫిట్ ఇండియా'లో భాగంగా ఆదివారం ఎస్పీ కార్యాలయం వద్ద సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ప్రజల భద్రత కోసం కష్టపడుతూ 24 గంటలూ విధుల్లో ఉండే పోలీసులకు శారీరక దృఢత్వం, మానసికోల్లాసం చాలా అవసరమన్నారు. సైక్లింగ్ ద్వారా శారీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, ఒత్తిడి తగ్గుతుందన్నారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలను అందించగలరన్నారు. ప్రతి ఒక్కనూ వారానికి కనీసం ఒక్క రోజైన సైక్లింగ్, వ్యాయామానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన సండే ఆన్ సైకిల్ ర్యాలీ లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదగా హౌసింగ్ బోర్డు కాలనీ, త్రీ పిల్లర్స్ సెంటర్, కోనేరు సెంటర్, రేవతి సెంటర్, బస్టాండ్ సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదగా తిరిగి ఎస్పీ కార్యాలయం వద్ద ముగిసింది. ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ సిహెచ్ రాజా, సీఐలు రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

సన్‌స్టార్ విద్యార్థుల సైకిల్ యాత్ర

సన్‌స్టార్ స్కూల్ విద్యార్థులు రిజిష్టార్ ఆఫీసు కార్యాలయం నుంచి చిలకలపూడి ఇంజనీరింగ్ కళాశాల వరకు ఆదివారం 40 మంది విద్యార్థులు సైకిల్ యాత్ర చేశారు. ఈ కార్యక్రమాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా విద్యానిధి కన్వీనర్ వి. శ్రీరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



పాండురంగస్వామి ఆలయంలో బూజు దులిపి, పరిసరాలను శుభ్రం చేస్తున్న గరుడ సేవా సమితి కార్యకర్తలు

పాండురంగస్వామి ఆలయంలో స్వచ్ఛ సేవ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడిలోని పాండురంగ స్వామి వారి దేవాలయ ప్రాంగణాన్ని ఆదివారం గరుడ సేవా సమితికి చెందిన 150 మంది భక్తులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభ్రం చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఏలూరు ప్రణవ పీఠం వ్యవస్థాపకులు వద్దిపర్తి పద్మాకర్ శిష్యులు, గుంటూరు, విజయవాడ, అవనిగడ్డ, కోడూరు, గుడివాడ, రేపల్లె ప్రాంతాల నుంచి 150 మంది తరలివచ్చారు. శివప్రసాద్ బృందం, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు చీపుర్లు పట్టి దేవాలయంలో బూజు దులిపారు. పిచ్చిమొక్కలు తొలగించారు. నాచుతో కూడిన సరస్సును శుభ్రం చేశారు. చిట్టికుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు టేకి నరసింహం పర్యవేక్షించారు. భక్తులు పాండురంగా పాండురంగా అంటూ సేవా కార్యక్రమం చేయడం విశేషం.



నూర్జహాన్‌ను సత్కరిస్తున్న మానవత ప్రతినిధులు

అవార్డు గ్రహీతలకు సత్కారం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా అవార్డులు పొందిన పలువురికి ఆదివారం వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సత్కరించారు. అవార్డు పొందిన నూర్జహాన్‌ను సన్‌స్టార్ స్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు జి. కిషోర్‌కుమార్, డాక్టర్ హసీంబేగ్, శ్రీరామ్, అయ్యప్ప స్వామి, ఆదిత్య, రాజేంద్రప్రసాద్ సత్కరించారు. ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో మలకాపట్నం గుప్తా సెంటర్‌లో జిల్లా ఉద్యోగ ఉపాధి శిక్షణా అధికారి దేవరపల్లి విక్టర్‌బాబును సత్కరించారు. గంధ్రపు సీనయ్య, విజయకుమార్, రిటైర్డు ఎం పీడీవో పి. మధు, జుజ్జవరపు అనిల్‌కుమార్, చిట్టూరి యువరాజ్, మట్టా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రాము బ్రహ్మత్వంలో యక్కటి వేణుగోపాలకృష్ణ - ఉదయలక్ష్మి దంపతు లు కల్యాణం జరిపి, అన్నదానం చేశారు. ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మండలి కృష్ణారావుకు ఘన నివాళి

నాగాయలంక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : శత జయంతి వేడుకలు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆదివారం 21వ రోజు పెదపాలెం సర్పంచ్ దున్నా రాజేష్ ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, బండ్రెడ్డి మల్లిఖార్జున్, అంబటి శ్యాం ప్రసాద్, ఉప్పల ప్రసాద్, తాడేపల్లి వెంకట పాపారావు, గుడివాక శివాజీ, షేక్ జానీ, తోపుల వేణు, తలశిల శివశంకర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రజకుల ధర్నా నేడు

మోపిదేవి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఈ నెల 25వ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు అవనిగడ్డ రజనీకాంత్ విజ్ఞప్తి చేశారు. పెదప్రోలు గ్రామంలోని అంకమ్మ తల్లి ఆలయం వద్ద ధర్నాకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. హక్కుల సాధనకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కల్లేపల్లి లక్ష్మీ, కల్లేపల్లి సుబ్బారావు, కల్లేపల్లి అరుణకుమారి, కొండపల్లి కనకదుర్గ, కల్లేపల్లి మంగమ్మ, కనకదుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం మహోన్నతం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదని మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరాన్ని బాబా ప్రసాద్ ప్రారంభించారు. మానవసేవే మాధవసేవగా భావిస్తూ రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. డి.కె. భారతి, కవిత, రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ భవిరి శంకరనాథ్, స్టేట్ ఆర్గనైజింగ్ మెంబర్ కె. రమేష్, జిల్లా కోశాధికారి రామ్‌బాలాజీ, మోటమర్రి బాబాప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెదప్రోలు సర్పంచ్ ఏసుబాబుకు మాతృవియోగం

మోపిదేవి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పెదప్రోలు గ్రామసర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబుకు మాతృవియోగం కలిగింది. ఏసుబాబు మాతృమూర్తి మనోహరమ్మ ఆదివారం మృతి చెందింది. ఆమె భౌతికకాయాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఏసుబాబును పరామర్శించారు. మనోహరమ్మ మృతి పట్ల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకులు ఏసుబాబును పరామర్శించారు.

పర్యాటకులు సూచనలు పాటించాలి

కోడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ వద్దకు విచ్చేసిన పర్యాటకులు మెరైన్ పోలీసుల సూచనలు తప్పక పాటించాలని, స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని మెరైన్ ఎస్సై పూర్ణ మాధవి తెలిపారు. పర్యాటకులకు మెరైన్ సిబ్బంది తగు సూచనలు, సలహాలు అందించారు. తీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గస్తీ నిర్వహించారు.

యోగా మాస్టర్ రమేష్‌కు తృతీయ బహుమతి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడులో జరిగిన రాష్ట్ర స్థాయి జరిగిన యోగా పోటీల్లో మచిలీపట్నానికి చెందిన యోగా మాస్టర్ రమేష్ తృతీయ బహుమతిని అందుకున్నారు. కాంస్య పతకం సాధించిన రమేష్‌ను రాష్ట్ర స్థాయి యోగా అసోసియేషన్ నాయకులు దుర్గారావు, నాగయ్య అభినందించారు.



మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధికి కుట్టుమిషన్లు ఉచితంగా అందజేస్తూ సహకరించడం ముదావహమని వాసవీ క్లబ్ జోనల్ ఇన్‌చార్జి యెండూరి సురేష్ అన్నారు. ఆదివారం శ్రీ పాద ఫంక్షన్ హాలులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. నిరుపేదలకు దుప్పట్లు అందజేశారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, బిహెచ్ఎస్ రమణబాబు, శ్రీకాకుళపు రేణుకారాణి, వేములు శిరీష, అన్నం అశోక్, జె. దివ్య, టి. అనూరాధ, టి.రంగనాయకులు, జె.రాంబాబు, జె. ప్రసాద్, సత్యనారాయణ, మాటూరి దీపు, ఉదయగిరి సతీష్, బలభద్ర ప్రసాద్, గుడివాడ మెహర్‌ప్రకాష్, ఎస్.ఎన్. గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కోడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పొలం గట్ల వివాదంలో తనకు న్యాయం జరగలేదంటూ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కోడూరు పోలీస్ స్టేషన్ వద్ద జరిగింది. కోడూరుకు చెందిన చిట్టిప్రోలు నరసింహ కోడూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై తన ద్విచక్ర వాహనాన్ని పడేసి తనకు న్యాయం జరగలేదంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు వెంటనే అతడిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వెంకట్రామ్ పరామర్శ

నాగాయలంక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సెక్యూరిటీ గార్డ్ (బౌన్సర్)గా పని చేస్తున్న ఆకుల శివ మాతృమూర్తి ఆకుల రమాదేవి ఇటీవల మృతి చెందారు. ఆదివారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, సర్పంచ్ మండలి ఉదయ్‌భాస్కర్, నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, అంజయ్య పాల్గొని రమాదేవి చిత్రపటానికి నివాళులర్పించి శివ కుటుంబసభ్యులను పరామర్శించారు.

రేషన్ డీలర్ సుబ్బారావుకు డీఎస్సీలో 16వ ర్యాంక్

నాగాయలంక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నంగేగడ్డలో పది సంవత్సరాలుగా రేషన్ షాపు డీలర్‌గా పని చేస్తున్న అందె వెంకట సుబ్బారావు ఇటీవల డీఎస్సీ పరీక్షలు రాశాడు. వెలువడిన ఫలితాల్లో 77.89 మార్కులతో జిల్లాలో 16వ ర్యాంక్ సాధించి మండలంలో సంచలనం కలిగించాడు. బీఈడీ చదివిన అందె వెంకట సుబ్బారావు గతంలో ఒకసారి డీఎస్సీ పరీక్షలు రాశాడు. కానీ అర్హత సాధించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ నిర్వహించగా, కష్టపడి చదివి పరీక్షలు రాశాడు. ఫలితాలలో జిల్లాలో తన ఉనికిని చాటుకున్నాడు. ఈ సందర్భంగా మండల రేషన్ డీలర్ సంఘం నేత రేమాల మురళీ తదితరులు అందెకు అభినందనలు తెలిపారు.